కాని నువ్వు పరమాత్మవే అనే జ్ఞానం నీలోనే వుంది తప్ప నీకు వేరుగా లేదు. అది నీ అనుభవంలోకి రావడం లేదంతే. దాన్ని నీ అనుభవంలోకి తెచ్చే సాధనాల్లో ఒకటి దైవ భక్తి. అంతేకాక వైద్య జ్ఞానం రావడానికి రామారావుకి రోజుకి కొంత చొప్పున మొత్తం చదవడానికి అయిదు సంవత్సరాలు పట్టింది. నువ్వు పరమాత్మవి అన్న జ్ఞానం ఇలా మెల్లి మెల్లిగా రాదు. ఒక్క చిటికె వేసినంత కాలం కూడా అందుకు పట్టదు. ఆ క్షణం రావడానికే భక్తి, ధ్యానం, వైరాగ్యం మొదలైనవి వుపయోగిస్తాయి."

ఆ వివరణతో శిష్యుడి అనుమానం తీరింది.

## 43. అక్షర లక్షలు

ఓ బ్రాహ్మణుడు ఓ రాజు దగ్గరకి తన కూతురి వివాహానికి తగిన ఆర్థిక సహాయం కోరి వచ్చాడు. రాజు ఆయనకి ఓ భగవద్గీతని ఇచ్చి చెప్పాడు.

"రేపు గీతా జయంతి. రేపు మీరు దీన్లోని పద్దెనిమిది అధ్యాయాలనీ బాగా అధ్యయనం చేసి ఎల్లుండి వచ్చి డబ్బు తీసుకు వెళ్ళండి."

ఆ బ్రాహ్మణుడు 'సరే' అని దాన్ని తీసుకుని వెళ్ళాడు. వారం అయినా ఆ బ్రాహ్మణుడు తిరిగి రాజు దగ్గరకి రాకపోవడంతో ఓ రోజు రాజు వార్తాహరుడ్ని పంపి ఆ బ్రాహ్మణుడ్ని పిలిపించి అడిగాడు.

"డబ్బు కోసం మీరు మళ్ళీ రాలేదే?"

"రాజా! మీరిచ్చిన గీతని క్షుణ్ణంగా అధ్యయనం చేసాను. అందులోని ఓ శ్లోకం చదివాక ఇక ధన సహాయం కోసం మీ దగ్గరకి రావాలనిపించక రాలేదు."

"తొమ్మిదో అధ్యాయంలోని ఇరవై రెండో శ్లోకం గురించి కాదుగా మీరు చెప్పేది?" నవ్వుతూ ప్రశ్నించాడు రాజు.

"అక్షర లక్షల కన్నా ఎక్కువ విలువ చేసే ఆ శ్లోకం సరిగ్గా అదే మహారాజా. *'అనన్యాశ్చింతయంతో మాం'* శ్లోకం ద్వారా ఆ పరమాత్ముడు ఎవరైతే తనని తీవ్రభక్తితో కొలుస్తారో వారి యోగక్షేమాలని తనే చూసుకుంటానని హామీ

ఇచ్చాడు. దాన్ని అర్థం చేసుకున్నాక ఇక ధనం కోసం పరమాత్మ మీద తప్ప ఈ లోకంలో ఇతరుల మీద ఆధార పడటం అవివేకం అనిపించి రాలేదు.”

రాజు నవ్వి చెప్పాడు.

“సంతోషం. నేను మీకు గీతని దేనికైతే ఇచ్చానో అది ఫలించింది. నాలా భగవంతుడ్ని నమ్ముకున్నవాడు ఎన్నడూ మోసపోడు.”

ఆ రాజు ఆ బ్రాహ్మణుడికి, అతని కూతురు వివాహానికి అవసరమైన ధనాన్ని ఇచ్చి పంపించాడు.

## 44. ఇప్పటికీ ఢిల్లీ దూరంగానే ఉంది

ఢిల్లీలోని నిజాముద్దీన్ అనే రైల్వే స్టేషన్ పేరు చాలామంది విని ఉంటారు, చూసి ఉంటారు కూడా. కాని ఆ నిజాముద్దీన్ గురించి అందరికీ పూర్తిగా తెలిసి ఉండకపోవచ్చు.

సూఫీ మహాత్ముడు నిజాముద్దీన్ ఔలియా ఢిల్లీలోని నేటి నిజాముద్దీన్ స్టేషన్ ప్రాంతంలో కొన్ని వందల ఏళ్ళ క్రితం జీవించి ఉన్న సమయంలో, నేటి లాగే అమాయక ప్రజల నించి దోచుకునే అధికార యంత్రాంగం తుగ్లక్ ప్రభుత్వంలో పనిచేస్తూండేది. మహాత్ముడైన ఆ నిజాముద్దీన్‌ని దర్శించుకోడానికి అనేక మంది భక్తులు వచ్చేవారు. కాని ఆయన ఆ అధికార యంత్రాంగంలోని ఎవరినీ తన దగ్గరకి రానిచ్చేవాడు కాదు. గయాజుద్దీన్ తుగ్లక్ దర్బారులో పనిచేసే అమీర్ ఖుస్రూ అనే ఒక్కర్ని మాత్రం ఔలియా తన దగ్గరకి రానిచ్చేవాడు. ఎందుకంటే ఖుస్రూ నిజాయితీ, పవిత్రత కలిగిన వాడు.

తుగ్లక్ ఖుస్రూ ద్వారా నిజాముద్దీన్ గొప్పతనాన్ని గురించి విని, ఆయన్ని దర్శించాలని సంబర పడ్డాడు. రాజ సాంప్రదాయ ప్రకారం, తను ఫలానా రోజున ఫలానా సమయానికి రాబోతున్నానని వార్తాహరుడ్ని ముందుగా పంపాడు. నిజాముద్దీన్ ఆ వార్తాహరుడితో నిక్కచ్చిగా ‘తుగ్లక్‌కి ప్రవేశం లేదు’ అని చెప్పాడు. రెండు, మూడు సార్లు తుగ్లక్ వార్తాహరుడ్ని పంపడం, తుగ్లక్ తనని చూడటానికి నిజాముద్దీన్ తిరస్కరించడం జరిగాయి.